క్లుప్తంగా

బీసీ సమస్యలపై నేడు నిరసన దీక్ష

హన్మకొండ: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుల జనగణనపై స్పష్టత కోరుతూ, బహుజన వర్గాలకు తీవ్ర నష్టం చేస్తున్న ఈడబ్ల్యూఎస్, జీఓ 29 రద్దు కోరుతూ ఈ నెల 30న హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద ఒక రోజు నిరసన దీక్ష చేపట్టనున్నట్లు ఆల్ ఇండియా ఓబీసీ జేఏసీ చైర్మన్ సాయిని నరేందర్, తెలంగాణ పూలే యువజన సంఘాల కన్వీనర్ తాడిశెట్టి క్రాంతి తెలిపారు. దీక్షకు బహుజన, కుల సంఘాలు, అగ్రవర్ణ పేదలు, ప్రగతిశీల వాదులు, మేధావులు, విద్యార్థులు, మహిళలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

బీసీ కమిషన్ పర్యటనలో బీసీలు పాల్గొనాలి

హన్మకొండ: బీసీ కమిషన్ పర్యటనలో భా గంగా నవంబర్ 2న హనుమకొండ కలెక్టరేట్‌లో నిర్వహించే సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని బీసీలంతా పాల్గొని అభిప్రాయాలు తెలపాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వద్దకొండ వేణు గోపాల్ గౌడ్ పిలుపునిచ్చారు. బీసీల విద్యా, ఉద్యోగ, రాజకీయ, సామాజిక స్థితిగతులను రాజకీయ పార్టీలకతీతంగా వివి ధ బీసీ కులాలు, సంఘాల డిమాండ్లను వినతి పత్రాల ద్వారా కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు. పర్యటనలో బీసీ మేధావులు, బీసీ ఉద్యోగస్తులు, బీసీ విద్యార్థులు, బీసీ యువత, బీసీ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

జైలర్‌కు అభినందనలు



వరంగల్: జైళ్ల శాఖలో ఉద్యోగంలో చేరి 25 ఏళ్లు పూర్తి చేసుకున్న జైలర్ గొట్టె రామకృష్ణ సిల్వర్ జూబ్లీ వేడుకలను మంగళవారం వరంగల్‌లోని సబ్ జైలు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు కేక్ చేసి అభినందనలు తెలిపారు. డీఎస్పీ విజయడేనీ, జైలర్ గోపిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

లభ్యంకాని యువకుడి ఆచూకీ

హన్మకొండ చౌరస్తా: సరదాగా ఈత కొడుదామని కెనాల్‌లో దూకిన యువకుడి ఆచూకీ ఐదు రోజులైనా లభ్యం కాకపోవడంతో కటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. హనుమకొండ పెద్దమ్మగడ్డకు చెందిన హన్మకొండ ఆదర్శ్ స్నేహితులతో కలిసి ఈ నెల 25న కెనాల్ వద్దకు వెళ్లారు. స్నేహితులు చూస్తుండగానే సరదాగా కెనాల్‌లో దూకాడు, వరద ఉధృతికి ఆదర్శ్ కొట్టుకుని పోయాడు. ఆదర్శ్ దూకిన సమయం నుంచి కొట్టుకుపోతున్న వీడియోను స్నేహితులు ఫోన్‌లో రికార్డు చేశారు. స్నేహితులు చూస్తుండగానే కొట్టుకుపోతున్న విషయాన్ని స్వయంగా పోలీసులకు తెలియజేశారు.

అవగాహన సదస్సు

ఖిలా వరంగల్: వరంగల్ ఫోర్ట్ రోడ్డులోని టాలెంట్ హైస్కూల్‌లో ఎఫ్ఎంఎం సాంఘీక సేవా సమితి మండల కోఆర్డినేటర్ ఈసంపల్లి సుదర్శన్ ఆధ్వర్యంలో హెచ్ఎం రవీందర్ అధ్యక్షతన బాలల అక్రమ రవాణాపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సుదర్శన్ మాట్లాడుతూ బాలబాలికలు సత్ప్రవర్తనతో పాటు సంస్కృతిక విలువలుపై సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని సూచించారు. బాలబాలికలు ఏదైనా అనుమానం వస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబర్లకు 100,112, 1098, 181,1930 డయల్ చేయాలని కోరారు. కార్యక్రమంలో సుజాత, విద్యార్థుల పాల్గొన్నారు

ఆవిర్భావ వేడుకలు జయప్రదం చేయాలి

న్యూశాయంపేట : ఏఐటీయూసీ 105 ఏళ్ల ఆవిర్భావ వేడుకలు జిల్లాలోని మండలాల్లో, గ్రామాల్లో జయప్రదం చేయాలని ఏఐటీయూసీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా సమితి సమావేశం బాలసముద్రం కార్యాలయంలో జరిగింది. సమావేశంలో నాయకులు రామ రాజేశ్‌ఖన్నా, సదానందం, రామూర్తి, రాజేందర్, పూర్ణచందర్, దుర్గాప్రసాద్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా వెంకట్రాములు



వరంగల్: బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా వరంగల్‌కు చెందిన తాటిపాముల వెంట్రాములు తిరిగి ఎన్నియ్యారు. హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సదస్సులో రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు తెలిపారు. ఈ సదస్సులో ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, రిటైర్డ్ ఐఏఎస్, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం కన్వీనర్ టి.చిరంజీవులు, ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్, బీసీ రాష్ట్ర నాయకులు యస్.బాల మల్లేష్, కోలా జనార్ధన్ తదితర ప్రముఖులు హాజరై ప్రసంగించినట్లు వెంకట్రాములు తెలిపారు.

65 బాణసంచా షాపులకు లైసెన్సులు

- అనుమతి లేకుండా విక్రయిస్తే చర్యలు
- వరంగల్‌లో 3 హోల్‌సేల్ దుకాణాలు
- 'సాక్షి'తో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీధర్‌రెడ్డి



వరంగల్ వివేకానంద కళాశాల పక్కనే ఉన్న పెట్రోల్‌పంపు చుట్టూ రేకులతో రక్షణ గోడ



మాట్లాడుతున్న సింగిరెడ్డి శ్రీధర్‌రెడ్డి

వరంగల్: జిల్లాలో లైసెన్సులు లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు తప్పవని జిల్లా అగ్నిమాపక అధికారి సింగిరెడ్డి శ్రీధర్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో ‘సాక్షి’తో మాట్లాడారు. బాణసంచా విక్రయాల కోసం 71 దరఖాస్తులు రాగా 65 దుకాణాలకు లైసెన్సులు మంజూరు చేశామన్నారు. గతంలో కేవలం పట్టణ ప్రాంతాల్లోనే లైసెన్సులు తీసుకునేవారని తెలిపారు. లైసెన్సులు లేకుండా విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని వరంగల్ పోలీసు కమిషనర్ జారీ చేసిన హెచ్చరికలతో గ్రామాలు, మండల కేంద్రాల్లో వ్యాపారులు దరఖాస్తు చేసుకోగా లైసెన్సులు జారీ చేశామన్నారు. దుకాణాలు ఏర్పాటు చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటే తప్ప ప్రమాదం జరిగిన తర్వాత ఏమి చేయలేమని ఇటీవల నిర్వహించిన సమావేశంలో వ్యాపారుల దృష్టికి తీసుకుపోయామని తెలిపారు. వ్యాపారులతోపాటు ఇంటి వద్ద బాణసంచా కాల్చేవారు సైతం తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోవన్నారు. వరంగల్ వివేకానంద జానియర్ కళాశాలలో దుకాణాల ఏర్పాటుకు పోలీసుశాఖ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో లైసెన్సులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. కళాశాల పక్కనే పెట్రోల్‌పంపు ఉన్నందున ముందు జాగ్రత్తగా బంకు చుట్టూ ఉన్న ప్రహరీపై రేకులతో గోడ ఏర్పాటు చేసిన అనంతరమే అనుమతి ఇస్తున్నట్లు తెలిపారు. వరంగల్ నగరంలో నీలకంఠ, కార్తికేయ, భగవాన్ హోల్‌సేల్ షాపులకు మాత్రమే అనుమతి ఇచ్చామన్నారు. జిల్లాలో ఎలాంటి బాణసంచా తయారీ కేంద్రాలు లేవని, కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని ఫైర్ విభాగం నుంచి అనుమతి పొందిన ఐదు షాపులు వరంగల్ చౌరస్తాలో ఉన్నాయని తెలిపారు. ఈషాపులు సైతం బాణసంచా విక్రయించాలంటే స్థానికంగా అగ్నిమాపక కేంద్రం నుంచి అనుమతి పొందాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర లైసెన్సులు ఉన్నాయని బాణసంచా విక్రయిస్తున్న ఆయా షాపులకు నోటీసులు జారీ చేశామన్నారు. ఈనోటీసులపై వ్యాపారులు కోర్టు నుంచి స్టే తీసుకొచ్చి విక్రయాలు చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటికే లైసెన్సులు లేని రెండు షాపులపై వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి సుమారు రూ.కోటిన్నరకుపైగా బాణసంచా నిల్వలు పట్టుకుని షాపులు సీజ్ చేశారని తెలిపారు. లైసెన్సులు జారీ చేసే అధికారం మాత్రమే అగ్ని మాపక శాఖకు ఉందని, సీజ్ చేసి, చర్యలు తీసుకునే అధికారం పోలీసు శాఖకు ఉందని తెలిపారు.

ములుగురోడ్డులో పెద్దమ్మతల్లి గుడి నిర్మించాలి



పూజలు చేస్తున్న ముదిరాజ్ సంఘ నాయకులు

వరంగల్: వరంగల్ ములుగు రోడ్డు సమీపంలోని ఇండస్ట్రీయల్ ప్రాంతంలో తవ్వకాల్లో వెలిసిన పెద్దమ్మతల్లికి గుడి నిర్మించాలని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్ ముదిరాజ్, జిల్లా అధ్యక్షుడు బయ్యస్వామిలు డిమాండ్ చేశారు. మంగళవారం తవ్వకాల్లో బయటపడిన పెద్దమ్మతల్లి విగ్రహానికి మదిరాజ్ నాయకులు పులి రజనీకాంత్‌తో కలిసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో పెద్దమ్మతల్లి విగ్రహం వెలవడం సంతోషదాయకమన్నారు. ప్రభుత్వ భూమిలో వెలిసిన అమ్మవారికి ఆ ప్రాంతంలోనే గుడి నిర్మించాలని హిందూ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయని, వరంగల్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు స్పందించి గుడి నిర్మాణానికి సహకరించి తల్లి విగ్రహం బయటపడిన ప్రాంతంలోనే పెద్దమ్మ గుడి నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. దాదాపు వేయి సంవత్సరాల క్రితం ఈ ప్రాంతంలో గుడి ఉండేదని ఆనాటి పూర్వీకులు చెబుతూ ఉండేవారని తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ నాయకులు చోపరి సోమయ్య, కోరబోయిన రవి, భయ్యా శోభన్, పులి మధుసూదన్, రాజేష్, వేణు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



కాశిబుగ్గ : యోగతో సంపూర్ణ ఆరోగ్యం పెంపొందుతుందని ప్రతీ ఒక్కరూ తమ జీవన విధానంలో యోగాను భాగస్వామ్యం చేసుకోవాలని ఆయుష్ జిల్లా ఇన్‌చార్జ్ వైద్యుడు మైదం రాజు తెలిపారు. ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని యాకుబ్‌పురలోని గిరిజన గురుకుల పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి యో గాసనాలు నేర్పించారు. ఆయుర్వేద వైద్యులు సహజ, రాజేందర్, ఫార్మసిస్ట్ సంజయ్, యోగా ట్రెనర్ కమలాకర్, ఏఎస్ఎం సమ్మక్క, ప్రిన్సిపాల్ రామ్మోహన్, వైస్ ప్రిన్సిపాల్ మధు పాల్గొన్నారు.

రైలు ఎక్కుతూ జారిపడిన ప్రయాణికుడు

- తీవ్ర గాయాలు, ఆస్పత్రిలో చికిత్స

కాశిబుగ్గ : కదులుతున్న రైలు ఎక్కుతూ ఓ ప్రయాణికుడు జారి రైలు, ప్లాట్‌ఫాం మధ్యలో పడి తీవ్ర గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటన వరంగల్ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం 1లో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. జీఆర్పీ సీఐ సురేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం తేని జిల్లా కంబం మండలం మధురమహలింగం వీధికి చెందిన శ్రీ సుధాకర్ చండీగఢ్ నుంచి మధురై జంక్షన్‌కు వెళ్లే మధురై సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు(20494)లో దిండిగల్ జంక్షన్‌కు వెళ్లేందుకు రామగుండంలో ఎక్కాడు. రైలు వరంగల్ రైల్వేస్టేషన్‌కు సాయంత్రం 4.24 గంటలకు చేరుకుంది. ఆహారం కోసం దిగిన సుధాకర్ రైలు కదులుతుండగా ఎక్కబోయాడు. ప్రమాదవశాత్తు జారీ రైలు ప్లాట్‌ఫాం మధ్యలో పడిపోయాడు. అది చూసిన ప్రయాణికులు కేకలు వేస్తూ చైన్ లాగారు. వెంటనే జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది స్థానికుల సాయంతో సుధాకర్‌ను బయటకు లాగి 108 ద్వారా ఎంజీఎం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమంగా ఉందని అక్కడి వైద్యులు తెలిపారు. ప్రమాద విషయాన్ని సుధాకర్ బంధువు భరత్‌కుమార్‌కు తెలిపామని సీఐ తెలిపారు.

'కుడా' పరిధి పెంచడం హాస్యాస్పదం

హన్మకొండ: వసతులు కల్పించలేని వారు కుడా పరిధి పెంచడం హాస్యాస్పదంగా ఉందని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో కాకతీయ పట్టణాభివృద్ధి (కుడా) పరిధిని పెంచడం విడ్డూరంగా ఉందని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కుడా పరిధి పెంచే ముందు నగర మాస్టర్ ప్లాన్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మానసిక దివ్యాంగులపై అవగాహన ఉండాలి

- కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్: మానసిక దివ్యాంగులపై ప్రతీ ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని కాకతీయ యూనివర్సిటీ వీసీ ఆచార్యులు కె.ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం యూనివర్సిటీలో నిర్వహించిన మానసిక దివ్యాంగలపై అవగాహన సదస్సుతో పాటుగా మల్లికాంబ మనోవికాసం కేంద్రం దివ్యాంగ పిల్లలతో తయారు చేయించిన మట్టి దీపాల(ప్రమిదలు) ప్రదర్శన కేంద్రాన్ని వీసీ ప్రారంభించారు. సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ వయస్సుకు తగ్గట్టుగా పిల్లల్లో రావాల్సిన మానసిక పరమైన ఎదుగుదల లేకపోవటం, జీవితకాల నాడి సంబంధిత రుగ్మత (న్యూరోలాజికల్ డిజార్డర్)గా దీనిని భావిస్తారన్నారు. కేయూ పాలకమండలి సభ్యురాలు డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ మానసిక దివ్యాంగుల సేవ విశ్వ మానవసేవ అని వారిపై ప్రేమ , ఆప్యాయతలను చూపాలన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి , మల్లికాంబ మనోవికాస కేంద్రం నిర్వాహకులు బండ రామలీల, కేయూ యూజీసీ కోఆర్డినేటర్ ఆచార్య ఆర్ మల్లికార్జున్‌రెడ్డి, కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ఆచార్య వై.వెంకయ్య, పద్మకోడం, కళ్యాణ్, శివరాం మానసిక దివ్యాంగ పిల్లలు పాల్గొన్నారు.

సమష్టిగా వర్సిటీని ముందుకుతీసుకెళ్దాం

అందరూ నాకు సమానమే సమష్టిగా కాకతీయ యూనివర్సిటీని ముందుకు తీసుకెళ్దామని వీసీ ఆచార్య ప్రతాప్‌రెడ్డి అన్నారు. కేయూలోని ఆల్‌మాల స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవలే వీసీగా బాధ్యతలను స్వీకరించిన వీసీని క్యాంపస్‌లోని అకడమిక్ కమిటీ హాల్‌లో మంగళవారం సన్మానం చేశారు.కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ వెంకయ్య, యూని వర్సిటీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ వరలక్ష్మి, డాక్టర్ మంజుల, తిరుమలాదేవి, డాక్టర్ శ్రీనివాస్,కరుణాకర్‌రావు, నిరంజన్, సదాశివుడు, కృష్ణ, సురేష్, బాబురావు,రామచందర్ పాల్గొన్నారు

సైన్స్ కోర్సుల సెమిస్టర్ పుస్తకాల ఆవిష్కరణ

కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని దూరవిద్యా కేంద్రం (ఎస్‌డీఎల్‌సీఈ), డిగ్రీ, పీజీ కోర్సుల్లో ఈ విద్యాసంవత్సరంలో సెమిస్టర్ సిస్టంను ప్రవేశపెట్టిన విషయం విధితమే. పీజీ కోర్సుల్లో నూతనంగా ఎమ్మెస్సీ సైన్స్ కోర్సుల్లో 21 పుస్తకాలను నూతనంగా రాయించారు. వీటికి ఇంటర్నేషనల్ స్టాండర్డ్ బుక్ నెంబర్స్ కూడా అలాట్ అయ్యాయి. ఆయా ఎమ్మెస్సీ సైన్స్ కోర్సుల ఆయా పుస్తకాలను మంగళవారం కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ మల్లారెడ్డితో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలోఅకుట్ జనరల్ సెక్రటరీ మామిడాల ఇస్తారి, ఎస్‌డీఎల్‌సీఈ డైరెక్టర్ వి.రాంచంద్రం, ఎస్‌డీఎల్‌సీఈ సైన్స్ కోర్సుల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంకటగోపినాథ్, పాల్గొన్నారు.

విజేతలను అభినందించిన కలెక్టర్



విద్యార్థులకు నగదు బహుమతిని అందజేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ అర్బన్ : రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి హెచ్ఐవీ ఎయిడ్స్ క్విజ్ కాంపిటీషన్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన కాజీపేట ప్రభుత్వ పాఠశాలకు చెందిన విధాత్రి, తేజస్వీ పాఠశాలకు చెందిన కల్లీముల్లాలను మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అభినందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ద్వారా వచ్చిన నగదు బహుమతిని అందజేసి త్వరలో నిర్వహించబోయే రీజనల్ స్థాయి పోటీల్లో కూడా ఉత్తమ ప్రతిభ కనబర్చి విజయం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ లలితాదేవి, డీఈఓ వాసంతి, అడిషనల్ డీఎంహెచ్ఓ మదన్‌మోహన్‌రావు, ఉపాధ్యాయులు స్వప్న, మాధురి పాల్గొన్నారు.

సంచార హెచ్ఐవీ టెస్టింగ్ వాహనం ప్రారంభం

రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ వారు ఉమ్మడి వరంగల్ జిల్లాకు కేటాయించిన సంచార హెచ్ఐవీ టెస్టింగ్, నిర్ధారణ వాహనాన్ని కలెక్టరేట్ ఆవరణలో మంగళవారం కలెక్టర్ ప్రావీణ్య ప్రారంభించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఐసీటీసీలు అందుబాటులో లేని ప్రాంతాలు, హైరిస్క్ ప్రాంతాల్లో హెచ్ఐవీ బాధితుల కుటుంబ సభ్యులకు ఈ సంచార వాహనం ద్వారా హెచ్ఐవీ టెస్టులు, కౌన్సిలింగ్ సేవలు అందుతాయని వివరించారు.

కేడీసీలో ఉచిత వైద్యశిబిరం

విద్యారణ్యపురి : హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శరత్ కంటి ఆసుపత్రికి సంబంధించిన వైద్య బృందం, మెడికవర్ ఆసుపత్రి వైద్య బృందం డాక్టర్ శ్రావణ్‌కుమార్, డాక్టర్ సాయికృష్ణ, ప్రకాశ్, కల్యాణ్‌లు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కేయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సురభి వినోద్‌రావు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సేవలు

దీపావళి విత్ మై భారత్ కార్యక్రమంలో భాగంగా కేడీసీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మంగళవారం హనుమకొండలోని మెటర్నటీ ఆస్పత్రిని సందర్శించి పరిసరాలను పరిశుభ్రం చేశారు.

సంక్షిప్త సమాచారం

గ్రామాల్లో సీపీఐని బలోపేతం చేయాలి



మడికొండ: గ్రామాల్లో సీపీఐని బలోపేతం చేయాలని హనుమకొండ జిల్లా సీపీఐ కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. మంగళవారం కాజీపేట మండలం రాంపూర్‌లో సీపీఐ మండల కౌన్సిల్ సమావేశం మంద సుమన్ అధ్యక్షతన నిర్వహించారు. భిక్షపతి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ వందేళ్లు పూర్తి చేసుకుందన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, లక్ష్మణ్, సీపీఐ కాజీపేట మండల కార్యదర్శి భిక్షపతి, పాల్గొన్నారు.

సన్మానం

రామన్నపేట : ఇటీవల నూతనంగా ఎన్నుకున్న హనుమకొండ జిల్లా పద్మ బ్రాహ్మణ సంఘం గౌరవ అధ్యక్షుడు బింగి రమేష్ ఆచార్యులు, అధ్యక్షుడు మలిపెద్దు కృష్ణశాస్త్రి, ఉపాధ్యక్షులు మార్త రాజ్‌కుమార్ శాస్త్రి, సహకార కార్యదర్శి రంగు యాదగిరి, చిందం కరుణాకర్, కోశాధికారి మార్త వేణుగోపాల్‌ను దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం రామన్నపేటలోని డాక్టర్ ఏ.రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంస్థ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు.

విద్యార్థులు నైపుణ్యాలు కలిగి ఉండాలి

కేయూ క్యాంపస్: విద్యార్థులు నైపుణ్యాలు కలిగి ఉండాలని కాకతీయ యూనివర్సిటీ సైన్స్ విభాగాల డీన్ ఆచార్యులు జి.హనుమంతు అన్నారు. మంగళవారం తెలంగాణా కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సహకారంతో నిర్వహిస్తున్న నేషనల్ సైన్స్‌డేను పురస్కరించుకొని ఇప్పటికే నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు బహుమతుల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. యూనివర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌లాల్, కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ వై.వెంకయ్య, కన్వీనర్ భరవిశర్మ మాట్లాడారు. పోటీల్లో పాల్గొని ప్రతిభచూపి విజేతలైన విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు.

కట్టయ్య ఆశయ సాధనకు కృషి

ఖిలా వరంగల్ : అంబేద్కర్‌వాది బొమ్మల కట్టయ్య ఆశయ సాధనకు కృషి చేద్దామని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్ కడారి కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం కరీమాబాద్‌లోని అంబేద్కర్ భవనంలో బొమ్మల కట్టయ్య విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

కాలుష్య రహిత దీపావళిని జరుపుకొందాం

విద్యారణ్యపురి: కాలుష్యరహిత దీపావళిని జరుపుకొందాం అంటూ హనుమకొండలో సైకిల్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జంగ గోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో సైకిల్ వాకర్స్ ర్యాలీ నిర్వహించారు. పబ్లిక్‌గార్డెన్ నుంచి చౌరస్తా మీదుగా వేయి స్తంభాల గుడి వరకు ర్యాలీ కొనసాగింది. ప్లకార్డులు చేతబూని ఈర్యాలీ నిర్వహించారు.

హసన్‌పర్తి: మండలంలోని సుజాత విద్యానికేత్ పాఠశాలలో ముందస్తు దీపావళి వేడుకలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. హెచ్ఎం రాంబాబు మాట్లాడుతూ టపాసులు కాల్చడంతో శబ్ద, వాయు కాలుష్యం ఏర్పడి వాతావరణంలో స్వచ్ఛమైన గాలి లభించక ప్రజలు శ్వాసకోశ సంబంధించి వ్యాధులకు గురవుతారని తెలిపారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

దేశాయిపేట: వరంగల్ ఎల్‌బీనగర్‌కు చెందిన దాసరి సాన్విక పైచదువుల నిమిత్తం మంగళవారం వీఏకే ఫౌండేషన్ నుంచి రూ.10 వేలను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వన్నాల వెంకటరమణ ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాన్విక తల్లిదండ్రులు మృతి చెందడంతో వన్నాల అరవింద్‌కుమార్ స్థాపించి న వీఏకే ఫౌండేషన్ ద్వారా సుమారు 700లకు పైగా కుటుంబాలకు నెలకు పది కిలోల బియ్యం, ఉచిత కంటి వైద్య శిబిరాలు, ఆపరేషన్లు, తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ పిల్లల చదువుల ఆర్థికసాయం, ప్రభుత్వ పాఠశాలలో ఉచిత నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

కార్మికుల హక్కులను హరిస్తున్న ప్రభుత్వాలు



రామన్నపేట : దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హరిస్తూ కార్మికులను అన్యాయం చేస్తున్నారని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కు రాజుగౌడ్ అన్నారు. మంగళవారం నగరంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో రాజుగౌడ్ పాల్గొని మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తూ ప్రైవేటీకరణ చేస్తూ ఉద్యోగులు, కార్మికుల వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్నారన్నారు. అనంతరం జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా రామ రాజేష్‌ఖన్నాను నియమిస్తూ రాజు ప్రకటించారు.

పరిసరాల శుభ్రత పాటించాలి

వరంగల్: సమాజంలోని ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతో పాటు పరిసరాల శుభ్రత పాటించాలని మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.నిర్మల అన్నారు. మంగళవారం వ్యవసాయ మార్కెట్‌లో మేరా యువ భారత్ వరంగల్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సామాజిక శుభ్రత పాటించి మన దేశాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీవైఓ అన్వేష్, చాంబర్ అధ్యక్ష, కార్యదర్శులు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, వేదం ప్రకాష్, చింతలపల్లి వీరారావు, నాగభూషణం, గ్రేడ్-2 కార్యదర్శులు, పాల్గొన్నారు.

హానికరమైన మందులతో నాణ్యతా లోపం

వరంగల్ : మిర్చిపంట సాగులో హానికరమైన పురుగు మందుల వాడకం వల్ల నాణ్యత లోపించే అవకాశాలు ఉన్నాయని వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం లక్ష్మీపురంలోని చాంబర్ కార్యాలయంలో స్పైసెస్ బోర్డ్ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో ములుగు జిల్లా మంగపేటకు చెందిన ఆదివాసీ ఫార్మ్ ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్‌కు చెందిన రైతులకు మిర్చి మార్కెట్ లింకేజ్ ప్రోగ్రాంపై శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మిర్చి పంట సాగులో హానికారక పురుగుమందులు వాడకుండా నాణ్యత పెంపుదలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

శ్మశాన వాటికలో పిచ్చిచెట్ల తొలగింపు

మడికొండ: గ్రేటర్ పరిధిలోని 46వ డివిజన్ మడికొండ, రాంపూర్‌లోని శ్మశాన వాటికలో డివిజన్ కార్పొరేటర్ మునిగాల సరోజన ఆదేశాల మేరకు మంగళవారం మున్సిపల్ సిబ్బంది పిచ్చిచెట్లను తొలగించి వీధిలైట్లను బిగించారు.

బోడగుట్ట శ్మశానవాటికలో గ్యాంగ్‌వర్క్

కాజీపేట రూరల్ : కాజీపేట 48వ డివిజన్ బోడగుట్టలోని హిందూ శ్మశానవాటికలో మంగళవారం బల్దియా సిబ్బంది గ్యాంగ్‌వర్క్ చేపట్టారు. కాంగ్రెస్ నాయకుడు దొంగల కుమార్ ఆధ్వర్యంలో జేసీబీతో చెట్లు, చెత్తను తొలగించి శుభ్రం చేశారు. శ్మశాన వాటికలోని ప్రహరీ త్వరలో ప్రారంభించనున్నట్లు నాయకులు తెలిపారు.

మౌలిక సౌకర్యాలు పూర్తి చేయండి

నయీంనగర్ : యునిసిటీ లే అవుట్ వెంచర్‌లో మౌలిక సదుపాయాలను త్వరగా పూర్తి చేయాలని కుడా వైస్ చైర్మన్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. కుడా ఆధ్వర్యంలో ఉనికిచర్ల ప్రాంతంలో ఏర్పాటు చేసిన యునిసిటీ లేఅవుట్ వెంచర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెంచర్‌లో రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ, డ్రెయిన్, తదితర పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు.


రీసెర్చ్ స్కాలర్స్ సమస్యలు పరిష్కరించాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో గత కొంత కాలంగా రెగ్యులర్ వీసీ లేక విద్యార్థుల, పరిశోధకుల సమస్యలు తీర్చడంలో జాప్యం జరిగిందని ఇకపై మీరు తీసుకునే నిర్ణయాలు వారి సంక్షేమం కోసం తీసుకోవాలని కేయూ రీసెర్చ్ స్కాలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉషన్‌నాయక్ వీసీ ప్రతాప్‌రెడ్డిని కోరారు. మంగళవారం వీసీని రీసెర్చ్ స్కాలర్స్ శుభాకాంక్షలు తెలిపిన అనంతరం పలు సమస్యలను వీసీ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కరిస్తానని వీసీ హామీ ఇచ్చారు.

కేయూలో హాస్టల్ విద్యార్థుల ధర్నా

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని న్యూ పీజీ బాయ్స్ హాస్టల్ వద్ద మంగళవారం పీజీ కోర్సుల ఫైనలియర్ విద్యార్థులు కొందరు ధర్నా చేపట్టారు. గత ఏడాది పీజీ కోర్సుల ఫస్టియర్‌లో ఆ న్యూపీజీ హాస్టల్‌లో తమకు వసతి కల్పించారు. అయితే ఈ విద్యాసంవత్సరంలో ఫైనలియర్ విద్యార్థులకు వేరే అంబేద్కర్, జగ్జీవన్ హాస్టల్‌లో వసతి కల్పించేందుకు ఉపక్రమించారు. అయితే తమకు అక్కడవసతి లభించలేదని దీంతో మేము న్యూ పీజీ హాస్టల్‌ను వెకేట్ చేయబోమని ఫైనలియర్ విద్యార్థులు ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న కేయూ హాస్టళ్ల డైరెక్టర్ సిహెచ్.రాజ్‌కుమార్ ఆయా విద్యార్థులతో మాట్లాడారు. దీపావళి తర్వాత ఎస్ఎఫ్‌సీ కోర్సుల విద్యార్థులకు కూడా వేరే చోట వసతి కల్పిస్తామని డైరెక్టర్ తెలిపారని దీంతో ఆందోళన విరమించినట్లు తెలిపారు.

టైల్స్ కార్మికులకు ఉపాధి కల్పించాలి



ఖిలా వరంగల్: ఇతర రాష్ట్రాల నుంచి భారీగా కార్మికులు వలస రావడంతో స్థానికులకు ఉ పాధి కరువైందని, దీని పై ప్రభుత్వం స్పందించి స్థానిక టైల్స్ కార్మికులకు ఉపాధి మార్గం చూపించాలని కాకతీ య టైల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జన్ను సునీల్ కోరారు. మంగళవారం శివనగర్‌లో బరిగల ప్రమోద్ అ ధ్యక్షతన టైల్స్ కా ర్మికుల సమావేశం జరి గింది. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ స్థానికులకు పనులు లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న తరుణంలో ఇతర రాష్ట్రాల కార్మికులు స్థానిక కార్మికుల ఉపాధిని దెబ్బతీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

విచారణ జరిపించాలి

కేయూ క్యాంపస్ : టీఎస్ఐసెట్-2024 నిర్వహణలో కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వర్తించిన ఆచార్య నర్సింహాచారి అవకవతకలకు పాల్పడ్డారని కాన్ఫిడెన్షియల్ పేరుతో లక్షల్లో అవకతవకలు జరి గాయని దీనిపై న్యాయమూర్తితో విచారణ జరిపించాలని ఏబీవీపీ జాతీయ కార్యవర్గసభ్యుడు మాచర్ల రాంబాబు డిమాండ్ చేశారు. మంగళవారం ఏబీవీపీ నాయకులు తమ నిరసన తెలిపారు. ఐసెట్ నిర్వహణ వ్యయంలో అవకతవకలకు పాల్పడిన కన్వీనర్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు వీసీ ప్రతాప్‌రెడ్డికి అకడమిక్ కమిటీహాల్‌లో విన్నవించి వినతిపత్రం సమర్పించారు. కేయూ వీసీ స్పందిస్తూ ఇప్పటికే ఈ విషయంపై రాష్ట్ర ఉన్నత విద్యామండలి దృష్టికి వెళ్లిందని ఇది తన పరిధిలో లేదన్నారు. విచారణ కమిటీ వేసే విషయం ఉన్నత విద్యామండలిలోనే చర్చించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు.

'శ్వేతార్క'లో పూజలు

కాజీపేట: 62వ డివిజన్ విష్ణుపురిలోని స్వయంభు శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో మంగళవారం స్వామి వారికి లక్షగరిక పూజలను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు అయినవోలు వెంకటేశ్వర్లు శర్మ ఆధ్వర్యంలో పండితులు దేశసౌభాగ్యసిద్ధి, రైతు క్షేమాన్ని కో రుతూ మానస సరోవరం నుంచి తెచ్చిన జలంతో స్వామి వారికి సహస్రాధారలతో అభిషేకం నిర్వహించారు.రాధాకృష్ణ శర్మ ప్రత్యేక హోమం జరుపించారు.

ఘనంగా ఆయుర్వేద దినోత్సవం



కాశిబుగ్గ : 9వ జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం వరంగల్ అనంత లక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల, వైద్యశాలలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ అనసూయ, వైద్యశాలలో సూపరింటెండెంట్ డాక్టర్ పద్మావతి ఆధ్వర్యంలో భగవాన్ ధన్వంతరి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.